నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా.. కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్ 2


Neti Velugu
# నేటి వెలుగు

నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక

RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com



నేటి వెలుగు తెలుగు దినపత్రిక
రిపోర్టర్లు కావలెను
తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాలలో నేటి వెలుగు తెలుగు దినపత్రికలో పని చేయుటకు
జిల్లా బ్యూరో
జిల్లా స్టాఫ్
డివిజన్ అసెంబ్లీ ఇంచార్జిలు
మండల రిపోర్టర్లు
జూనియర్లకు సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నెంబరు
95532 76552
ఎడిటర్
నవీన్ కుమార్ గౌడ్



| నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 167 | పేజీలు : 4 | సెప్టెంబర్ 30 బుధవారం 2026 | వెల రూ. 4.00/- |
|---|---|---|---|---|---|
| NALGONDA | VOL:3 | ISSUE: 167 | PAGES:4 | WEDNESDAY SEPTEMBER 30 2026 | Rs. 4:00 |








నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

# బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కేటీఆర్

**ఇది మరో తుగ్లక్ నిర్ణయమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శ**

**చౌకగా లభించే సింగరేణి బొగ్గును కాదని విదేశీ బొగ్గు కొంటున్నారని ఆరోపణ**

**టన్నుకు రూ. 3,800 బదులు రూ.9,000 చెల్లిస్తున్నారని ఆగ్రహం**

**ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయమంటూ ఎక్స్‌లో కేటీఆర్ ప్రశ్న**



తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో 'తుగ్లక్ నిర్ణయం'గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర వెచ్చించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఈ నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయని, ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారని ఆయన ప్రశ్నించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయనే విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో సింగరేణి సంస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సైతం బొగ్గును సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించిందని వివరించారు. రాష్ట్రంలోనే పుష్కలమైన వనరులు ఉండగా, వాటిని కాదని అధిక ధర చెల్లించి దిగుమతి చేసుకోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

# దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు: మంత్రి పొన్నం ప్రభాకర్

**దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం**

**ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య**

**ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ**

రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.



# నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా.. కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్

**కేటీఆర్ వ్యాఖ్యలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం**

**కేసీఆర్‌పై పార్టీ వైఫల్యాలు నెడుతున్నారంటూ విమర్శలు**

**కేటీఆర్ తీరు పార్టీ వ్యతిరేకం కాదా అంటూ నిలదీత**

**ఫామ్‌హౌస్‌లు, క్విడ్ ప్రో కోపై ఆరోపణలు**

**రైతు, మహిళ పట్ల వ్యాఖ్యలపై కేటీఆర్‌పై విమర్శలు**




బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్టమైన ఆధారాలతో అన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఇలా చేస్తూ బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఓ అవినీతి వ్యక్తిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదే వ్యక్తితో కలిసి ఉంటూ, కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సాయం కోరుతూ వచ్చిన మహిళతోనూ అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు. గణేశ్ నిమజ్జనోత్సవంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంతమందిని బతిమాలుకున్నారో గణేశుడికి, వారి అంతరాత్మకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తాను విషనాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడతానని స్పష్టం చేశారు. తనతో పెట్టుకోవద్దని హెచ్చరిక జారీ చేశారు.

# 52 ఏళ్ల వయసులోనూ ఫిట్‌గా.. సీఎం విజయ్ డైట్ ఇదే!

**52 ఏళ్ల వయసులోనూ సీఎం విజయ్ అద్భుతమైన ఫిట్‌నెస్**

**కఠినమైన డైట్లకు బదులు సాధారణ ఇంటి భోజనం**

**ఇష్టమైన మటన్ బిర్యానీకి డైట్‌లో చోటు**

**వాకింగ్, రన్నింగ్‌తో పాటు తేలికపాటి వ్యాయామాలు**

**ఫిట్‌నెస్ రహస్యాలను పంచుకున్న ట్రైనర్ నరేశ్ కుమార్**



తమిళనాడు ముఖ్యమంత్రిగా బిజీ షెడ్యూల్‌తో గడుపుతున్న 52 ఏళ్ల విజయ్, ఈ వయసులోనూ ఎంతో ఫిట్‌గా, చురుగ్గా ఉండటానికి గల కారణాలను ఆయన ఫిట్‌నెస్ ట్రైనర్ నరేశ్ కుమార్ వెల్లడించారు. కఠినమైన డైట్ నియమాలు, ఖరీదైన ఆహార పద్ధతులకు బదులుగా, విజయ్ సాధారణ ఇంటి భోజనం, క్రమమైన వ్యాయామంతోనే తన ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారని ఆయన వివరించారు. ఈ సింపుల్ విధానమే ఆయన ఫిట్‌నెస్ మంత్రం అని స్పష్టం చేశారు. విజయ్ దినచర్య చాలా నిలకడగా ఉంటుంది. ఆయన సాధారణంగా ఉదయం 5:30 నుంచి 6 గంటల మధ్య నిద్రలేస్తారు. ఉదయం 9 గంటల సమయంలో అల్పాహారంగా రెండు ఇడ్లీలతో పాటు గుడ్లు తీసుకుంటారు. మధ్యాహ్న భోజనంలో అన్నంతో పాటు కూరగాయలు, పండ్లు, ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని ఇష్టపడతారు. రాత్రి భోజనం చాలా తేలికగా ఉంటుంది. ఎక్కువగా సూప్ లేదా సలాడ్ వంటివి తీసుకుంటారు. ఆయన ఫిట్‌నెస్ కోసం రుచిలేని ఆహారాన్ని బలవంతంగా తినే రకం కాదు. తనకు ఇష్టమైన సంప్రదాయ దక్షిణ భారత వంటకాలనే పరిమితంగా తీసుకుంటారు. జంక్ ఫుడ్‌కు పూర్తిగా దూరంగా ఉంటారు. అప్పుడప్పుడు ఇష్టమైన మటన్ బిర్యానీని ఆస్వాదిస్తారు. కొన్ని సందర్భాల్లో తన సన్నిహితుల కోసం ఏర్పాటు చేసే విందుల్లో కూడా బిర్యానీ వడ్డిస్తారని చెబుతారు. అలాగే శక్కరై పొంగల్ వంటి సంప్రదాయ తీపి వంటకాలను కూడా అప్పుడప్పుడు రుచి చూస్తారు. ఆహార నియమాలతో పాటు వ్యాయామానికి కూడా విజయ్ అంతే ప్రాధాన్యత ఇస్తారు. రోజూ వాకింగ్, రన్నింగ్, సైక్లింగ్‌తో పాటు తేలికపాటి బరువులతో ఎక్కువ రిపిటీషన్స్‌తో కూడిన వెయిట్ ట్రైనింగ్ చేస్తారు. ఒకవేళ జిమ్‌కు వెళ్లడం సాధ్యం కాకపోతే, రోజువారీ శారీరక శ్రమను పెంచుకుంటారు. తీవ్రమైన కసరత్తుల కన్నా, నిలకడగా వ్యాయామం చేయడానికే ఆయన మొగ్గు చూపుతారు. ఈ సమతుల్య జీవనశైలే ముఖ్యమంత్రిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన శక్తిని అందిస్తోందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

# ఓటర్ల జాబితా సవరణ: తెలంగాణలో 48.88 లక్షల మందికి అర్హత

**ఇప్పటివరకు 61 లక్షలకు పైగా విచారణలు పూర్తి చేసిన అధికారులు**

**అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలకు తుది గడువు**

**నవంబర్ 9న ఓటర్ల తుది జాబితా వెల్లడి**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియలో భాగంగా, ఇప్పటివరకు 48,88,076 మందిని తుది జాబితాలో చేర్చేందుకు అర్హులుగా గుర్తించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఈ వివరాలను వెల్లడించిన ఆయన, ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ అత్యంత వేగంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలోని తప్పులు, ఇతర సాంకేతిక సమస్యల కారణంగా మొత్తం 92,88,180 నోటీసులు జారీ చేయగా, వాటిలో 88,52,173 నోటీసులను ఇప్పటికే ఓటర్లకు చేరవేసినట్లు ఆయన వివరించారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓ), సహాయ ఈఆర్ఓల పర్యవేక్షణలో ఇప్పటివరకు 61,87,444 విచారణలు పూర్తయ్యాయని, మరో 12,99,368 నోటీసులు ప్రస్తుతం జిల్లా ఎన్నికల అధికారుల పరిశీలనలో ఉన్నాయని సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. గత ఆగస్టు 17న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో సుమారు 73.39 లక్షల మందిని ఏఎస్‌డీఎస్ (మరణించిన, చిరునామా మారిన, నకిలీ ఓటర్లు) కేటగిరీ కింద గుర్తించారు. ఈ నేపథ్యంలోనే ఓటర్ల జాబితాలో పారదర్శకతను పెంచేందుకు ఈ భారీ సవరణ ప్రక్రియను చేపట్టారు. ఈ క్రమంలోనే ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌లో మార్పులు చేశారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం, అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు అక్టోబర్ 7ను చివరి తేదీగా నిర్ణయించారు. వీటి పరిష్కార ప్రక్రియ నవంబర్ 5 వరకు కొనసాగుతుందని, అనంతరం నవంబర్ 9న ఓటర్ల తుది జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నుంచి నోటీసులు అందుకున్న ఓటర్లు తప్పనిసరిగా స్పందించి, సంబంధిత పత్రాలతో విచారణకు హాజరుకావాలని సీఈఓ సూచించారు. విచారణకు హాజరుకాని పక్షంలో, వారి పేర్లను తుది జాబితాలో చేర్చడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.



# తరాల మధ్య అనుబంధాన్ని బలోపేతం చేయాలి





**అంగన్వాడీ సూపర్వైజర్ చంద్రకళ**

**వర్ధన్నపేట ప్రతినిధి, సెప్టెంబర్ 29 (నేటి వెలుగు ప్రతినిధి):**

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా వర్ధన్నపేట మండలం బండౌతపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం వద్ద మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ సూపర్వైజర్ చంద్రకళ ముఖ్యఅతిథిగా హాజరై వయోవృద్ధులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోవృద్ధులు కుటుంబానికి విలువైన మార్గదర్శకులని, వారి అనుభవాలు భావితరాలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. పిల్లలు, యువత వయోవృద్ధులను గౌరవిస్తూ వారితో ఆత్మీయంగా మెలగాలని సూచించారు. పిల్లలు, వయోవృద్ధుల మధ్య అనుబంధాన్ని పెంపొందించేలా ఆటలు, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. వయోవృద్ధులకు ప్రేమ, గౌరవం, భద్రత, అవసరమైన వైద్య సహాయం అందించడం ప్రతి కుటుంబ బాధ్యత అన్నారు. వయోవృద్ధులకు సహాయం లేదా సమాచారం అవసరమైతే 14567 టోల్ఫ్రీ నంబర్కు సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం వయోవృద్ధుల సంక్షేమం, గౌరవప్రదమైన జీవనం, కుటుంబంలో ఆత్మీయ వాతావరణం కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అమరేందర్, అంగన్వాడీ టీచర్లు వజ్రమ్మ, బుజ్జమ్మ, ఆయా సుశీల, వయోవృద్ధులు, చిన్నారులు పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీని వేగవంతం చేయాలి









**70 శాతం లక్ష్యాన్ని త్వరగా అధిగమించాలి: కలెక్టర్ మను చౌదరి**

**మేడ్చల్--మల్కాజిగిరి, సెప్టెంబర్ 29 నేటి వెలుగు ప్రతినిధి :**

జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాన్ని త్వరలోనే 70 శాతానికి పైగా పూర్తి చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాబోయే ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోళ్ల సన్నాహాలు, రైతుల సంక్షేమంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు (ఏవోస్), వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓస్ ), కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులతో ధాన్యం కొనుగోళ్లపై సమగ్రంగా సమీక్షించారు. ప్రతి మండలంలో కనీసం ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల కోసం స్థలాలను ముందుగానే గుర్తించాలని, రవాణా ఆలస్యం కాకుండా ప్రత్యామ్నాయ గోదాములు, అదనపు నిల్వ స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, టార్పాలిన్ షీట్లు, సుత్తిలి, మాయిశ్చర్ మీటర్లు, ఆటోమేటిక్ క్లీనింగ్ మిషన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని గోదాములకు తరలించేందుకు అవసరమైనన్ని వాహనాలను సిద్ధంగా ఉంచాలని రవాణా కాంట్రాక్టర్లను ఆదేశించారు. గోదాముల వద్ద ధాన్యం అన్లోడింగ్ సమయంలో ట్రాఫిక్ రద్దీ, కూలీల కొరత వంటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్లతో సమన్వయం చేసుకుని ధాన్యం ఆరబెట్టేందుకు కొనుగోలు కేంద్రాల సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఖాళీ స్థలాలను పరిశీలించాలని తెలిపారు. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని రక్షించేందుకు వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయాలని, ధాన్యం తడవకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కొనుగోళ్ల సమయంలో సమస్యలు తలెత్తితే రైతులతో అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు ఓపికగా, సానుకూలంగా వ్యవహరిస్తూ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించాలని అన్నారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లను వారి సమస్యలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వారు వివరించిన సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని, అవసరమైన మేరకు వ్యవసాయ యంత్ర పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై డీఎం సుగుణ బాయి, సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, వ్యవసాయ శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జన గణనలో ఓబీసీ కాలము చేర్చాల్సిందే

- 40 ప్రశ్నలతో జారీ చేసిన కులగణన గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి
- బీసీ జేపీసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

**హైద్రాబాద్ సెప్టెంబర్ 29 నేటి వెలుగు ప్రతినిధి**



జాతి జనగణలో ఎస్సీ,ఎస్టీ లతోపాటు ఓబీసీ కాలమును కూడా చేర్చాల్సిందేనని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 8న ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఓబిసి చేపడతామని హామీ ఇచ్చి ఈరోజు ఆ యొక్క హామీని విస్మరించిందని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సినటువంటి మిగతా పార్టీలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయని అన్నారు. జనగణన పై జాతీయ స్థాయిలో అఖిలపక్ష పార్టీల మేధావుల కుల సంఘాల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న వెంటనే 40 ప్రశ్నలతో కూడిన గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని అన్నారు. బిజెపి ప్రభుత్వం పూర్తి బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ఎర్రబెల్లి దుర్గయ్య రాంబాబు యాదవ్ నక్క నాగరాజు తాడూరి సైదులు తదితరులు పాల్గొన్నారు

# గొర్రెల యజమాని రైతు బిడ్డ కిష్టయ్యను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

**బీసీ జేపీసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

**యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్ 29 నేటి వెలుగు ప్రతినిధి:**



బీబీనగర్--ఘట్కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య కొండమడుగు సమీపంలో జరిగిన విషాదకర ఘటనలో గొర్రెల యజమాని రైతు కిష్టయ్యకు తీవ్ర నష్టం వాటిల్లిందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. అర్ధరాత్రి సమయంలో కుక్కలు,అడవి పందులు బెదిరించడంతో భయపడిన సుమారు 600 గొర్రెల మంద రైల్వే ట్రాక్పైకి రావడంతో,అదే సమయంలో అటుగా వచ్చిన రైలు ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో కిష్టయ్యకు చెందిన గొర్రెలన్నీ మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. గొర్రెలన్నీ మృతి చెందడంతో రైతు కిష్టయ్యకు దాదాపు రూ.40 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని, గొర్రెల పెంపకమే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న కుటుంబం ఒక్కసారిగా తమ జీవనోపాధిని కోల్పోయి దిక్కుతోచని పరిస్థితుల్లో ఉందన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కిష్టయ్య కుటుంబానికి ప్రత్యేక ఆర్థిక సహాయం అందించడంతో పాటు, జరిగిన నష్టాన్ని పూర్తిగా అంచనా వేసి తగిన పరిహారం చెల్లించాలని జాజుల లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న బీసీ గొల్ల--కురుమ కుటుంబాలకు ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వం ప్రత్యేకంగా స్పందించి, వారి జీవనోపాధిని కాపాడే విధంగా సహాయక చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు.

# యస్.సి. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా శ్రీ రాగి ఉపేందర్ రావు బాధ్యతల స్వీకరణ

**సూర్యాపేట, సెప్టెంబర్ 29, నేటి వెలుగు ప్రతినిధి**

యస్.సి. కార్పొరేషన్, సూర్యాపేట జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా శ్రీ రాగి ఉపేందర్ రావులి నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీ రాగి ఉపేందర్ రావు లిజిల్లా కలెక్టర్, సూర్యాపేట ని మర్యాదపూర్వకంగా కలిసిలి, వారి సూచనల మేరకు యస్.సి. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారు యస్.సి. కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, అర్హులైన ఎస్సీ లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ రాగి ఉపేందర్ రావు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో యస్.సి. కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, ఎస్సీ వర్గాల సంక్షేమం మరియు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

# వయోవృద్ధుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

- సర్పంచ్ తౌర్రి పద్మ యాదవ్



**పర్వతగిరి, సెప్టెంబర్ 29 (నేటి వెలుగు ప్రతినిధి ):**

వయోవృద్ధుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఏనుగల్లు గ్రామ సర్పంచ్ తౌర్రి పద్మ యాదవ్ అన్నారు.పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామంలో అంగన్వాడీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ తౌర్రి పద్మ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వయోవృద్ధులు కుటుంబానికి, సమాజానికి విలువైన మార్గదర్శకులని, వారి అనుభవాలు భావితరాలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ ఆప్యాయత, గౌరవంతో వ్యవహరించడంతో పాటు వారి ఆరోగ్యం, భద్రత, అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వృద్ధులు ఒంటరితనానికి గురికాకుండా కుటుంబ సభ్యులు వారికి అండగా నిలవాలని సూచించారు. అనంతరం వృద్ధులను ఆత్మీయంగా పలకరించి, కేక్ కట్ చేయించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు అరుణ,వినోద, అనిత, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీపురం మార్కెట్ నుంచి రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌గా అశోక్ బాబు

- 16ఏళ్ల సేవా ప్రస్థానానికి మరో గౌరవం..
- మార్కెట్ ముద్దుబిడ్డ
- అశోక్ బాబు ఎన్నికపై వ్యాపార వర్గాల నిరాజనం
- పుష్పగుచ్ఛాలు, శాలువాతో ఘన సత్కారం

**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 29 (నేటి వెలుగు ప్రతినిధి):**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బేతి అశోక్ బాబును వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ వర్తక సంఘం, పరపతి సంఘం, కమిషన్ వ్యాపారస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌కు చెందిన హోల్‌సేల్ వ్యాపారి, సహచర నాయకుడైన బేతి అశోక్ బాబు అంచెలంచెలుగా ఎదుగుతూ సామాజిక సేవా రంగంలో తనదైన గుర్తింపు తెచ్చుకున్నారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. జిల్లా స్థాయి సేవా సంస్థ అయిన రెడ్‌క్రాస్‌కు చైర్మన్‌గా ఆయన ఎన్నిక కావడం మార్కెట్‌కు గర్వకారణమని అన్నారు.బేతి అశోక్ బాబు వరంగల్ జిల్లా కూరగాయల మార్కెట్ సెక్రటరీగా 16 సంవత్సరాలు సేవలందించడంతో పాటు, మార్కెట్ పరపతి సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాంకీ విల్లా ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా, వరంగల్ పద్మశాలి జిల్లా యువజన అధ్యక్షుడిగా, చేయూత స్వచ్ఛంద సేవా సంఘం ఉపాధ్యక్షుడిగా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ సామాజిక సేవలో కొనసాగుతున్నారు.రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా పేదలు, బాధితులు, ఆపదలో ఉన్నవారికి మరింత మెరుగైన సేవలు అందించాలని మార్కెట్ వర్గాలు ఆకాంక్షించాయి. ప్రజా సేవలో బేతి అశోక్ బాబు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి శ్రీనివాస్, మల్లూరి బాబురావు, సోలా శ్రీనివాస్, దౌలత్ బాజీ, రవికాసర్ల రాజు, రేపల్లె రాజు, శీలం సత్యనారాయణ, దేవరపల్లి భద్రయ్య, వలిశెట్టి మురళి, ఎన్కె అమర్, గుర్రాల మోహన్, బేతి రాజు, పరిషవీరన్న, కొండా హరి, నల్లదిగల కుమార్, బిజ్జా శ్రీహరి, జోగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఆసిఫ్‌నగర్ కాలువలో పూడికతీత పనులు చేపట్టాలి





- గుర్రపు డెక్క, నాచు, తూటి ఆకులను తొలగించాలి: జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ, సెప్టెంబర్ 29 నేటి వెలుగు ప్రతినిధి:**

ఆసిఫ్‌నగర్ కాలువలో పూడికతీతతో పాటు గుర్రపు డెక్క, నాచు, తూటి ఆకులను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ డీఆర్‌డీఓను ఆదేశించారు.మంగళవారం నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అక్కినేపల్లి నుంచి చిప్పలపల్లి వరకు ఉన్న ఆసిఫ్‌నగర్ కాలువను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కాలువలో పూడిక, గుర్రపు డెక్క, నాచు, తూటి ఆకులు పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి, ఆయకట్టుకు సక్రమంగా నీరు అందడం లేదని తెలుసుకున్న కలెక్టర్, మోటార్‌సైకిల్‌పై సుమారు 4.5 కిలోమీటర్ల మేర కాలువను స్వయంగా పరిశీలించారు.అనంతరం డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డితో మాట్లాడిన కలెక్టర్.. అవసరమైన ప్రాంతాల్లో వీబీజీ రాంజీ పథకం కింద పూడికతీతతో పాటు గుర్రపు డెక్క, నాచు, తూటి ఆకులను తొలగించే పనులు చేపట్టాలని సూచించారు. పనులకు సంబంధించిన అంచనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.పనులు చేపట్టే అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేయాలని కలెక్టర్ సూచించారు. కాలువలో పూడికతీత, గుర్రపు డెక్క, నాచు, తూటి ఆకులను తొలగించేందుకు వీలుగా మార్చి, ఏప్రిల్ నెలల్లోనే కాలువకు నీటి సరఫరాను నిలిపివేసేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

చిప్పలపల్లి గ్రామపంచాయతీ సందర్శన

అనంతరం జిల్లా కలెక్టర్ నూతనంగా ఏర్పడిన చిప్పలపల్లి గ్రామపంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంజిరెడ్డితో మాట్లాడిన కలెక్టర్, మహిళా సంఘ భవనంతో పాటు గ్రామపంచాయతీ భవనాన్ని సక్రమంగా వినియోగిస్తున్నారా? లేదా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ వెంట డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ సునీత, ఏఈ శరత్‌చంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, అక్కినేపల్లి సర్పంచ్ రాజు, ఆర్ఐ సైదులు, ఉపసర్పంచ్ లక్ష్మమ్మ, చిప్పలపల్లి సర్పంచ్ అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

# నల్గొండ పట్టణంలో లీగల్ మెట్రాలజీ శాఖ తనిఖీలు





**నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపార సంస్థలపై 13 కేసులు నమోదు**

**నల్గొండ జిల్లా సెప్టెంబర్ 29 నేటి వెలుగు ప్రతినిధి:**

వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణలో భాగంగా నల్గొండ పట్టణంలోని వివిధ కూరగాయల దుకాణాలు, ఇనుము--హార్డ్‌వేర్ దుకాణాలు, శానిటరీ దుకాణాల్లో జిల్లా లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు.జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ కె. వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.తనిఖీల సందర్భంగా ఆయా వ్యాపార సంస్థల్లో వినియోగిస్తున్న తూకాలు, కొలతల పరికరాల ధృవీకరణ, స్టాంపింగ్ చెల్లుబాటు, తూకాలు--కొలతల ఖచ్చితత్వం తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. అదేవిధంగా ప్యాకేజ్డ్ వస్తువులపై చట్టప్రకారం ప్రకటించాల్సిన తప్పనిసరి వివరాలను కూడా తనిఖీ చేశారు.తనిఖీల్లో లీగల్ మెట్రోలజీ అక్ట్ 2009 మరియు ప్యాకేజీ టు కమోడిటీస్ రూల్స్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వ్యాపార సంస్థలపై మొత్తం 13 కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. సంబంధిత కేసుల్లో చట్టపరమైన నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.వ్యాపారులు తమ వద్ద వినియోగించే తూకాలు, కొలతల పరికరాలను నిర్ణీత కాలవ్యవధిలో ధృవీకరించించుకొని, చెల్లుబాటు అయ్యే స్టాంపింగ్‌తో మాత్రమే వినియోగించాలని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి సూచించారు. ప్యాకేజ్డ్ వస్తువులపై చట్టపరంగా నిర్దేశించిన అన్ని వివరాలను తప్పనిసరిగా ప్రకటించాలని స్పష్టం చేశారు.వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణకు లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా అధికారి తెలిపారు.

## గురుకుల మహిళా డిగ్రీ హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ

**విద్యార్థినుల వసతులు, ఆహార నాణ్యతపై పరిశీలన**

**సూర్యాపేట, సెప్టెంబర్ 29 నేటి వెలుగు ప్రతినిధి:**

జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రెండో విడత తనిఖీల్లో భాగంగా మంగళవారం సాయంత్రం సూర్యాపేటలోని 40వ వార్డు, గొల్లబజార్‌లో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ హాస్టల్‌ను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డిఎంహెచ్వో ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హాస్టల్‌లోని వసతి గృహాలు, భోజనశాల, వంటశాల, స్టోర్‌రూమ్, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణతో పాటు విద్యార్థినులకు కల్పిస్తున్న మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి ఆహార నాణ్యత, పరిశుభ్రత, హాస్టల్ నిర్వహణ తీరును సమీక్షించారు.అనంతరం విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆహార భద్రత, పరిశుభ్రమైన జీవన విధానంపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు.హాస్టల్ నిర్వహణ పనితీరును కూడా సమీక్షించిన డిఎంహెచ్వో , విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, సురక్షితమైన వసతి, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన మౌలిక సదుపాయాలు నిరంతరం అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యార్థినుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.



# బాలల సంరక్షణపై అధికారులకు అవగాహన సదస్సు





● **బాలల సమస్యల పరిష్కారానికి శాఖల సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట, సెప్టెంబర్ 29 నేటి వెలుగు ప్రతినిధి:**

బాలల సంరక్షణ, పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో యూనిసెఫ్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో బాలల సంరక్షణ, పిల్లల సమస్యల పరిష్కారంలో అధికారుల పాత్రపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాలల సంరక్షణ, పిల్లలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, వాటి మధ్య ఉన్న వ్యత్యాసాలు, సామాజిక వ్యవస్థలు పిల్లలపై చూపుతున్న ప్రభావం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, వివిధ శాఖల వద్ద ఉన్న గణాంకాలు, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి బాలల సమస్యల పరిష్కారంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. బాలల సంరక్షణను ప్రతి అధికారి తన బాధ్యతగా భావించి చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రగ్స్, బాల్య వివాహాలు లేని గ్రామాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సదస్సులో చర్చించిన అంశాల ఆధారంగా శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనిసెఫ్ (హైదరాబాద్) రిసోర్స్ పర్సన్ ఫిలిప్పే మాట్లాడుతూ పిల్లల సమస్యలపై వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో స్పందించాల్సిన తీరును వివరించారు. బాలల సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు శాఖల వారీగా యాక్షన్ ప్లాన్స్ రూపొందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పిల్లలు, ప్రజలకు బాలల హక్కులు, రక్షణ, సమస్యలపై ఏ విధంగా అవగాహన కల్పించాలనే అంశాలపై అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఆర్ఓ ప్రేమ్ రాజ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనుష, టి. వసంత్, డీడబ్ల్యూఓ కె. నరసింహారావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి విశాల్ ధార, ఆర్డీవో పురుషోత్తం రెడ్డి, డీఐఈఓ సులోచన రాణి, డీవైఎస్ఓ వెంకట్ రెడ్డి, పోలీస్ అధికారులు, రవాణా, ఫైర్ సేఫ్టీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాలో పీసీపీఎన్‌డీటీ అమలుపై సమీక్ష





**లింగ నిర్ధారణ, లింగ ఎంపికను అరికట్టేందుకు కఠిన చర్యలు**

**మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా సెప్టెంబర్ 29 నేటి వెలుగు ప్రతినిధి :**

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, లింగ ఎంపికను నిరోధించేందుకు అమలులో ఉన్న పీసీపీఎన్‌డీటీ చట్టం--1994, నిబంధనల అమలు, పర్యవేక్షణపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ సమావేశం నిర్వహించారు.అదనపు కలెక్టర్ (పట్టణ స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్, సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ కార్యదర్శిగా వ్యవహరించారు.సమావేశంలో పీసీపీఎన్‌డీటీ కార్యక్రమం నోడల్ అధికారి డా. గీతా ప్రసాద్, సైబరాబాద్ మహిళలు--బాలల భద్రత విభాగం ఏసీపీ కృష్ణ ప్రసాద్, మేడ్చల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ నరసింహారెడ్డి, కార్పె డియమ్ ఫౌండేషన్ ప్రతినిధి బి. కుమార్ కృపా, డిప్యూటీ జిల్లా ఎక్స్‌టెన్షన్ మీడియా అధికారి వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.30 దరఖాస్తులకు ఆమోదంపీసీపీఎన్‌డీటీ చట్టం, నిబంధనలకు అనుగుణంగా మొత్తం 30 దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. ఇందులో 18 కొత్త దరఖాస్తులు, 12 పునరుద్ధరణ దరఖాస్తులు ఉన్నాయి. సంబంధిత రికార్డులు, నిబంధనలను పరిశీలించిన అనంతరం కమిటీ చర్చించి మొత్తం 30 దరఖాస్తులకు ఆమోదం తెలిపింది.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, లింగ ఎంపికకు దారితీసే చర్యలను అరికట్టేందుకు పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అల్ట్రాసౌండ్, ఇమేజింగ్ కేంద్రాల్లో వైద్య పరీక్షలు చట్టబద్ధమైన వైద్య అవసరాలకు మాత్రమే పరిమితం కావాలని, నిబంధనల ఉల్లంఘనలకు తావులేకుండా కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక మాట్లాడుతూ, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చట్టవిరుద్ధమైన చర్య అనే విషయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు, స్థానిక సంస్థలు, మహిళా--శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, అంగన్‌వాడీ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీ సంస్థల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఆడపిల్లల భ్రూణహత్యకు స్వస్తి పలికి, ఆడపిల్లలను రక్షించడం, వారికి సమాన అవకాశాలు కల్పించడం ద్వారా లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సమావేశంలో పేర్కొన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## నాన్‌వెజ్ వల్ల ఇన్ని సమస్యలు వస్తాయా?



ప్రతి రోజూ నాన్ వెజ్ తింటే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. ప్రతి రోజూ నాన్ వెజ్ ఐటెమ్స్ తినే వారిలో ఖచ్చితంగా కొన్ని వ్యాధులు వస్తాయట. ఆహార అలవాట్లు.. శరీర ఆరోగ్యం మీదనే కాకుండా.. మానసిక ఆరోగ్యం మీద కూడా ప్రభావం చూపిస్తుంటాయి. రోజూ ఫాస్ట్ ఫుడ్స్, లేదా మాంసం తినే వారిలో సాధారణంగా డయాబెటీస్, బీపీ, క్యాన్సర్, ఊబకాయం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు వస్తాయి. అంతేకాదు మతి మరుపు కూడా వచ్చే అవకాశం ఉందట. ప్రతిరోజూ మాంసం తినే వారిలో వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఎలా అనుకుంటున్నారా? ఆస్ట్రేలియాలోని బాండ్ యూనివర్శిటీలో 438 మంది వ్యక్తులపై పరిశోధన చేశారు ఆరోగ్య నిపుణులు. ఆహారపు అలవాట్లు జ్ఞాపకశక్తిపై ఎలా పని చేస్తున్నాయో తెలుసుకున్నారు. ఈ అధ్యయనం 438 మంది కొనసాగితే అందులో 108 మందికి అల్జీమర్స్ వ్యాధి వచ్చినట్టు తేలిందట. దీని ప్రకారం ఎక్కువగా నాన్ వెజ్ తింటే వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వస్తుంది అంటున్నారు నిపుణులు. అంటే ఇంట్లో మనుషులను కూడా గుర్తించలేని పరిస్థితి కూడా వస్తుందట. ప్రతిరోజూ మాంసం తినేవారిలో అధిక బరువు, హై కొలెస్ట్రాల్, డయాబెటీస్, బీపీ, ఫ్యాటీ లివర్, గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం మరింత ఎక్కువ ఉంటుందట. ఈ సమస్యలు మాత్రమే కాదు ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు కూడా వస్తాయట. రోజూ పండ్లు, కూరలు, గింజలు తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు అసలు కనిపించడం లేదని పరిశోధనలో తేలిందట. మాంసాహారాలు ఎక్కువగా తీసుకుంటే నరాల సమస్యలు వస్తాయి సో స్కిప్ చేయండి. ఎక్కువగా తినకుండా లిమిట్ గా తినడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. అతి సర్వత్రా వర్జయేత్. సో మితంగా తిని ఆరోగ్యంగా ఉండండని సలహా ఇస్తున్నారు నిపుణులు.

## పెరుగు వల్ల ఇన్ని ప్రయోజనాలు ఉంటాయా?

పేగులకు మంచిది: పెరుగు లోని ప్రోబయోటిక్స్ పేగులు బాగా పనిచేయడానికి సహాయపడుతుంటాయి. కడుపు ఉబ్బరాన్ని తగ్గించే శక్తి కూడా ఈ పెరుగుకు ఉంటుంది. మానసిక ఒత్తిడి: పెరుగులోని యాంటీఆక్సిడెంట్లు, మంచి కొవ్వులు, ప్రోబయోటిక్‌లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తిని పెరుగు తగ్గిస్తుంది. ఈ హార్మోన్ నియంత్రణలో ఉంటే బరువు తగ్గుతుంటారు. జ్ఞాపకశక్తి మెరుగుదల: జ్ఞాపకశక్తిని పెంచుకోవాలనుకుంటే ప్రతిరోజూ పెరుగు తినాలి అంటున్నారు నిపుణులు. పెరుగులోని కాల్షియం, విటమిన్ డి జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి సహాయం చేస్తుంది. చర్మ సంరక్షణ: పెరుగు తినేవారి చర్మం పొడిబారకుండా ఉంటుంది. తేమ వల్ల యవ్వనంగా కనిపిస్తారు కూడా. దురద ఉంటే కూడా పెరుగు తినడం వల్ల ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు అంటున్నారు నిపుణులు. పెరుగులోని జింక్, విటమిన్ సి, కాల్షియం చర్మానికి ఎంతో మేలు చేస్తుంటాయి. ఎముకలు, దంతాల బలం : ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తుంది ఈ పెరుగు. వీటికి అవసరమైన ఫాస్ఫరస్, కాల్షియం లు కూడా ఇందులో ఉంటాయి. దీన్ని ప్రతిరోజూ తినడం వల్ల దంతాలు చాలా స్ట్రాంగ్ గా ఉంటాయి. ఎముకలను కూడా బలోపేతం చేయడం వల్ల కీళ్లనొప్పులు రాకుండా నిరోధించుకోవచ్చు. బిపి %డ% షుగర్ నియంత్రణ: పెరుగులోని పోషకాలు సులభంగా జీర్ణం అవడానికి కూడా ఈ పెరుగు ఉపయోగపడుతుంది. దీనిలోని ప్రోటీన్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. పెరుగులో ఉండే మెగ్నీషియం అధిక రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యం: ప్రతిరోజూ పెరుగు తీసుకునే వారికి కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి అంటున్నారు నిపుణులు. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. మెదడుకు మంచిది: పెరుగులో ఉండే ప్రోటీన్ మెదడు కణాల పెరుగుదల , నిర్వహణకు సహాయపడుతుంది అంటున్నారు నిపుణులు. పెరుగు, పంచదార రెండింటినీ కలిపి తింటే మెదడుకు మంచిదట. ఎందుకంటే పెరుగుతో పాటు పంచదార తిన్నప్పుడు లభించే గ్లూకోజ్ మెదడు శక్తిని పెంచడానికి మరింత సహాయపడుతుంది. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది పెరుగు. ఇందులోని టైరోసిన్ వంటి అమైనో ఆమ్లాలు మెదడులో డోపమైన్, సెరోటోనిన్, నోర్‌పైన్‌ఫ్రైన్ వంటి హార్మోన్‌లను నియంత్రిస్తాయి.



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్



# అసాధ్యమనుకున్న యాంగిల్ నుంచి గోల్.. మెస్సీ మ్యాజిక్‌కు ఫాన్స్ ఫిదా..

**కొలంబస్ క్రూతో జరిగిన మ్యాచ్‌లో ఇంటర్ మయామి ఓటమి**

**అద్భుత ఫ్రీకిక్‌తో అబ్బురపరిచిన లియోనెల్ మెస్సీ**

**అత్యంత క్లిష్టమైన యాంగిల్ నుంచి గోల్ చేసి ఆకట్టుకున్న వైనం**

**చివరి నిమిషాల్లో గోల్ చేసి కొలంబస్ జట్టు విజయం**

**మెస్సీ మ్యాజిక్ చేసినా జట్టుకు తప్పని ఓటమి**



ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ మరోసారి తన మ్యాజిక్‌తో అభిమానులను అబ్బురపరిచాడు. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. కానీ, అతని అద్భుత ప్రదర్శన జట్టును గెలిపించలేకపోయింది. మేజర్ లీగ్ సాకర్‌లో భాగంగా కొలంబస్ క్రూతో జరిగిన మ్యాచ్‌లో మెస్సీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఇంటర్ మయామి జట్టు 1-2 తేడాతో ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో మెస్సీ కొట్టిన అద్భుత ఫ్రీకిక్ గోల్ హైలైట్‌గా నిలిచింది.ఆట ప్రారంభమైన 28వ నిమిషంలో కొలంబస్ జట్టుకు పెనాల్టీ లభించగా, జోసెఫ్ మార్టినెజ్ దానిని గోల్‌గా మలిచి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అయితే, కేవలం ఐదు నిమిషాల వ్యవధిలోనే మెస్సీ తన క్లాస్ చూపించాడు. మైదానం కుడివైపున, గోల్ పోస్ట్‌కు అత్యంత క్లిష్టమైన కోణంలో లభించిన ఫ్రీకిక్‌ను మెస్సీ నేరుగా గోల్‌లోకి పంపించాడు. దాదాపు అసాధ్యమనుకున్న యాంగిల్ నుంచి బంతిని నెట్‌లోకి పంపిన తీరుకు ప్రత్యర్థి గోల్‌కీపర్‌తో సహా సహచర ఆటగాళ్లు కూడా ఆశ్చర్యపోయారు. ఈ సీజన్‌లో మెస్సీకి ఇది 21వ గోల్.ఆ తర్వాత కూడా మెస్సీ మరో గోల్ చేసే ప్రయత్నం చేయగా, కొలంబస్ కీపర్ దానిని అడ్డుకున్నాడు. మరోవైపు మయామి కొట్టిన ఓ గోల్‌ను ఆఫ్ సైడ్ కారణంగా రద్దు చేశారు. ఇక మ్యాచ్ డ్రాగా ముగుస్తుందనుకున్న సమయంలో, ఇంజ్యూరీ టైమ్‌లో కొలంబస్ ఆటగాడు బ్రాయిస్ మెండెజ్ కొట్టిన షాట్‌ను మయామి కీపర్ పట్టుకోలేకపోయాడు. దీంతో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన జమాల్ థియారే దానిని గోల్‌గా మలిచి కొలంబస్‌కు విజయాన్ని అందించాడు.ఈ ఓటమితో ఇంటర్ మయామి జట్టు, ఈస్టర్న్ కాన్ఫరెన్స్ లీడర్ నాష్‌విల్లే కంటే 14 పాయింట్ల వెనుకంజలో ఉంది. అయితే, మెస్సీ కొట్టిన గోల్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఫుట్‌బాల్ అభిమానులు దీనిని "ఇంపాజిబుల్ గోల్", "గోలాజో" (స్పానిష్ భాషలో అద్భుతమైన గోల్) అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. రిటైర్మెంట్ ఊహాగానాల మధ్య కూడా మెస్సీ తన ఆటతో అద్భుతాలు సృష్టిస్తూనే ఉన్నాడు.

# ఆసియా క్రీడల్లో నీరూ ధండా చారిత్రక స్వర్ణం.. అభినందించిన ప్రధాని మోదీ



**ఆసియా క్రీడల ట్రాప్ షూటింగ్‌లో చరిత్ర సృష్టించిన నీరూ ధండా**

**ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గా రికార్డు**

**మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు రజత పతకం**

**విజేతలను అభినందిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్**

జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో భారత షూటర్లు అద్భుత ప్రదర్శన చేశారు. మహిళల ట్రాప్ ఈవెంట్‌లో నీరూ ధండా చారిత్రక స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆసియా క్రీడల చరిత్రలో ఈ విభాగంలో వ్యక్తిగత స్వర్ణం సాధించిన తొలి భారతీయ మహిళగా ఆమె రికార్డు సృష్టించింది. ఇదే ఈవెంట్‌లో మహిళల జట్టు రజత పతకాన్ని గెలుచుకుని భారత్ ఖాతాలో మరో పతకాన్ని చేర్చింది.ఈ చారిత్రక విజయాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. విజేతలను అభినందిస్తూ ఎక్స్ లో పోస్టులు పెట్టారు. "నీరూ ధండా భారత్‌కు చారిత్రక విజయాన్ని అందించింది. ఆసియా క్రీడల ట్రాప్ ఈవెంట్‌లో వ్యక్తిగత స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళగా నిలిచిన ఆమెకు అభినందనలు. ఆమె అద్భుతమైన కచ్చితత్వం, నిలకడ దేశానికి గర్వకారణం. ఈ విజయం ఎందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుంది" అని మోదీ పేర్కొన్నారు. అలాగే, టీమ్ ఈవెంట్‌లో రజతం గెలిచిన మనీషా, నీరూ, ఆషిమాలను కూడా ప్రధాని అభినందిస్తూ, వారి టీమ్‌వర్క్‌ను ప్రశంసించారు.మంగళవారం జరిగిన ఫైనల్‌లో నీరూ ధండా అత్యంత నిలకడైన ప్రదర్శన కనబరిచింది. మొత్తం 28 హిట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. చైనాకు చెందిన సన్ యునోంగ్ (26 హిట్లు) రజతం గెలుచుకోగా, కువైట్‌కు చెందిన హజర్ అబ్దుల్‌మాలిక్ (21 హిట్లు) కాంస్యంతో సరిపెట్టుకుంది. అంతకుముందు క్వాలిఫికేషన్ రౌండ్‌లోనూ 118 పాయింట్లతో నీరూ అగ్రస్థానంలో నిలవడం విశేషం. మరోవైపు, మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో నీరూ ధండా, ఆషిమా అహ్లావత్, మనీషా కీర్‌లతో కూడిన భారత బృందం రజత పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఈ ముగ్గురూ సంయుక్తంగా 328 స్కోరు సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఈ విభాగంలో చైనా (346) స్వర్ణం గెలుచుకోగా, కువైట్ (325) కాంస్య పతకం దక్కించుకుంది. అయితే, ఆషిమా, మనీషా వ్యక్తిగత ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయారు.

# వెస్టిండీస్‌కు భారీ షాక్: రెండో వన్డేకు సెంచరీ హీరో గ్రీవ్స్ దూరం

**తొలి వన్డేలో సెంచరీ చేసే సమయంలో పిక్క కండరాల గాయం**

**అధికారికంగా ప్రకటించిన క్రికెట్ వెస్టిండీస్**

**గువాహటి వేదికగా రెండో వన్డే**



భారత్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో పర్యాటక వెస్టిండీస్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తొలి వన్డేలో అద్భుత శతకంతో జట్టుకు భారీ స్కోరు అందించిన ఆల్‌రౌండర్ జస్టిన్ గ్రీవ్స్ గాయం కారణంగా రెండో మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఈ విషయాన్ని క్రికెట్ వెస్టిండీస్ అధికారికంగా ధ్రువీకరించింది.తిరువనంతపురం వేదికగా జరిగిన తొలి వన్డేలో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో జస్టిన్ గ్రీవ్స్ కాలి పిక్క కండరాల గాయానికి గురయ్యాడు. అయినప్పటికీ పట్టుదలతో ఆడి 108 బంతుల్లో 101 పరుగులు సాధించాడు. ఈ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది.సిరీస్‌లో భాగంగా రెండో వన్డే గువాహటిలో జరగనుంది. ఈ మైదానంలో భారత్‌కు మెరుగైన రికార్డు ఉంది. ఇక్కడ జరిగిన గత రెండు వన్డేల్లోనూ టీమిండియానే విజయం సాధించింది. ఈ నేపథ్యంలో, అద్భుత ఫామ్‌లో ఉన్న కీలక ఆటగాడు గ్రీవ్స్ దూరం కావడం విండీస్ జట్టుకు పెద్ద లోటుగా మారింది.

# సీఎస్‌కే బౌలింగ్ కోచ్‌గా మోహిత్ శర్మ

**కోచింగ్ బృందంలో కీలక మార్పులు చేసిన చెన్నై సూపర్ కింగ్స్**

**గతంలో చెన్నై తరఫున కీలక బౌలర్‌గా రాణించిన మోహిత్**

**వరుస వైఫల్యాల నేపథ్యంలో కోచింగ్ బృందంలో మార్పులు**



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తమ కోచింగ్ బృందంలో కీలక మార్పులు చేస్తోంది. జట్టు నూతన బౌలింగ్ కోచ్‌గా టీమిండియా మాజీ పేసర్ మోహిత్ శర్మను నియమించనుంది. ఐపీఎల్ 2027 సీజన్ కోసం సీఎస్‌కే హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన జహీర్ ఖాన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రాబోయే వారాల్లో సహాయక సిబ్బందికి సంబంధించి మరిన్ని అధికారిక ప్రకటనలు వెలువడే అవకాశం ఉంది.గతంలో స్టీఫెన్ ఫ్లెమింగ్ ప్రధాన కోచ్‌గా ఉన్న సమయంలో బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించిన ఎరిక్ సిమన్స్ స్థానంలో 38 ఏళ్ల మోహిత్ శర్మ బాధ్యతలు స్వీకరించనున్నాడు. మోహిత్ శర్మకు చెన్నై ఫ్రాంచైజీతో సుదీర్ఘ అనుబంధం ఉంది. అతడు నాలుగు సీజన్ల పాటు సీఎస్‌కే తరఫున 48 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడటమే కాకుండా, ఛాంపియన్స్ లీగ్ టీ20లో 10 మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించాడు. 2025లో చివరిసారిగా ఐపీఎల్ ఆడిన మోహిత్, అదే ఏడాది డిసెంబర్‌లో క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. భారత్ తరఫున 8 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. 2023లో ఐదోసారి ఐపీఎల్ టైటిల్ గెలుచుకున్న సీఎస్కే, ఆ తర్వాత వరుసగా మూడు సీజన్లలో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. ఈ నేపథ్యంలో జట్టు ప్రదర్శనను మెరుగుపరిచే లక్ష్యంతో హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో జహీర్ ఖాన్‌ను నియమించారు. జహీర్ నేతృత్వంలోని కొత్త కోచింగ్ బృందంలో మోహిత్ శర్మ నియామకం తొలి ప్రధాన మార్పు కావడం గమనార్హం.

# నా బ్యాట్లు దొంగిలించారు.. మోదీకి చెప్పాలా లేక యోగికా?: దీపక్ చాహర్ ఫన్నీ వీడియో

టీమిండియా పేస్ బౌలర్ దీపక్ చాహర్‌కు చేదు అనుభవం ఎదురైంది. అతడికి ఎంతో ఇష్టమైన ఖరీదైన క్రికెట్ బ్యాట్లు చోరీకి గురయ్యాయి. ఈ విషయాన్ని స్వయంగా చాహర్ సోషల్ మీడియా వేదికగా పంచుకోగా, ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. బ్యాట్లు పోయాయనే బాధలో ఉన్నప్పటికీ, ఆ విషయాన్ని అతడు వ్యంగ్యంగా, హాస్యభరితంగా వివరించిన తీరు నెటిజన్లను ఆకట్టుకుంటోంది.వివరాల్లోకి వెళితే, ప్రాక్టీస్ గ్రౌండ్‌లో ఉంచిన దీపక్ చాహర్ బ్యాట్లు అపహరణకు గురయ్యాయి. సుమారు రూ. 1.5 లక్షల విలువైన మూడు ప్లేయర్-ఎడిషన్ బ్యాట్లు కనిపించకుండా పోయాయని అతడె వెల్లడించాడు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసిన వీడియోలో ఈ ఘటన గురించి వివరిస్తూనే, సదరు దొంగకు తనదైన శైలిలో ఒక విజ్ఞప్తి చేశాడు."ఆ బ్యాట్లను దొంగిలించిన వ్యక్తికి బహుశా వాటి అసలు విలువ తెలియకపోవచ్చు. వాటితో అతను టెన్నిస్ బాల్ క్రికెట్ ఆడతాడో లేక మరెవరికైనా విక్రయిస్తాడో తెలీదు. అదేదో నేరుగా నా దగ్గరికే వచ్చి డబ్బులు అడిగి ఉంటే ఇచ్చేవాడిని కదా" అంటూ చాహర్ ఆవేదనతో కూడిన హాస్యాన్ని పండించాడు. అనంతరం తన పరిస్థితిని వివరిస్తూ, "ఇప్పుడు నేను ఏం చేయాలి? పోలీసులకు ఫిర్యాదు చేయాలా? లేక యోగి గారి దగ్గరికో, మోదీ గారి దగ్గరికో వెళ్లాలా? లేదంటే ఆ దేవుడిని వేడుకోవాలా? అదీ కాదంటే మరో రెండు, మూడు బ్యాట్లు పంపమని తయారీ కంపెనీని అడగాలా?" అంటూ తన అయోమయాన్ని సరదాగా పంచుకున్నాడు. తన బ్యాట్లను తిరిగి ఇచ్చేయాలని కోరుతూ చాహర్ చేసిన ఈ వీడియో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ హల్‌చల్ చేస్తోంది.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

# నాన్న డబ్బులిస్తేనే ఆ సినిమాలో నటిస్తానని చెప్పా: విక్టరీ వెంకటేశ్

**కొత్త సినిమా ప్రమోషన్లలో ఆసక్తికర విషయం చెప్పిన వెంకటేశ్**

**చిన్నప్పుడు నటనకు పారితోషికం అడిగానని వెల్లడి**

**'ప్రేమ నగర్' చిత్రంలో నటించినందుకు తండ్రి రూ. 1000 ఇచ్చారని వెల్లడి**

**అక్టోబర్ 9న వెంకటేశ్ కొత్త చిత్రం 'ఆదర్శ కుటుంబం' విడుదల**



టాలీవుడ్ కథానాయకుడు విక్టరీ వెంకటేశ్ తన చిన్ననాటి ఒక మధుర జ్ఞాపకాన్ని అభిమానులతో పంచుకున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా, శ్రీనిధి శెట్టి కథానాయికగా నటించిన చిత్రం 'ఆదర్శ కుటుంబం – హౌస్ నెం. 47'. ఈ చిత్రం అక్టోబర్ 9న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ప్రముఖ యాంకర్ సుమ కనకాలకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో వెంకటేశ్ ఆసక్తికర విషయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా సుమ, 'ప్రేమ నగర్' చిత్రంలో బాలనటుడిగా ఉన్నప్పటి ఫోటోను చూపించగా, వెంకటేశ్ ఆ నాటి స్మృతులను నెమరువేసుకున్నారు. "ఒకరోజు నేను పాఠశాలలో ఆడుకుంటుండగా, మా ఫ్యామిలీ మేనేజర్ వచ్చి నాన్న (డి. రామానాయుడు) పిలుస్తున్నారని చెప్పారు. ఎందుకని ఆరా తీయగా, సినిమాలో ఒక చిన్న పాత్రలో నటించాలని తెలిపారు. అప్పట్లో మా నాన్న షూటింగ్ ముగిశాక జూనియర్ ఆర్టిస్టులకు పారితోషికం పంపిణీ చేయడం నాకు గుర్తుంది. దాంతో నేను కూడా, 'నాకు కూడా డబ్బులు ఇస్తారా?' అని అడిగాను" అని వెంకటేశ్ నవ్వుతూ గుర్తు చేసుకున్నారు. మేనేజర్ ఆ విషయాన్ని తన తండ్రికి చెప్పగా, ఆయన నాకు 1,000 రూపాయలను పారితోషికంగా ఇచ్చారని వెంకటేశ్ తెలిపారు. ఆ తర్వాతే 'ప్రేమ నగర్' సినిమాలో కైకాల సత్యనారాయణ చిన్నప్పటి పాత్రలో నటించానని ఆయన వివరించారు. వెంకటేశ్ పంచుకున్న ఈ సరదా సంఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# రోహిత్ శర్మ అర్ధాంగి 'సెంటిమెంట్'.. కేబీసీ షోలో ఆసక్తికర విషయం చెప్పిన అమితాబ్

మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ప్రముఖ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' (కేబీసీ)లో ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, ఆయన అర్ధాంగి రితికా సజ్దేకు సంబంధించి అమితాబ్ ఒక మధురమైన జ్ఞాపకాన్ని పంచుకున్నారు. రోహిత్ ఆడేటప్పుడు రితికా పాటించే ఒక సెంటిమెంట్‌ను ఆయన బయటపెట్టారు.కేబీసీ 18వ సీజన్‌లో భాగంగా హాట్‌సీట్‌లో ఉన్న సోనాలి అనే కంటెస్టెంట్‌కు క్రికెట్‌కు సంబంధించిన ప్రశ్న ఎదురైంది. ఈ సందర్భంగా ఆమె తాను రోహిత్ శర్మకు వీరాభిమానినని చెప్పారు. "సర్, నేను రోహిత్ శర్మకు పెద్ద ఫ్యాన్. ఆయన్ను కలవడం నా కల. నన్ను నేనే ఆయన భార్యగా భావించుకుంటాను" అని ఆమె అమితాబ్‌తో అన్నారు. దీనికి అమితాబ్ సరదాగా స్పందిస్తూ.. "మీకు ఆయనంటే చాలా ప్రేమ ఉన్నట్టుంది. ఈ విషయం తప్పకుండా ఆయనకు చెబుతాం. మీరు ఆయన భార్య కావడానికి వచ్చారని తెలియజేస్తాం" అని నవ్వుతూ అన్నారు.ఈ సంభాషణ తర్వాత అమితాబ్ బచ్చన్, రోహిత్ శర్మపై తనకున్న అభిమానాన్ని పంచుకున్నారు. "రోహిత్ మాకు ఎంతో ఇష్టమైన క్రీడాకారులలో ఒకరు. ఆయనంటే మాకు చాలా ఇష్టం. వ్యక్తిగతంగా కూడా చాలాసార్లు ఆయనతో మాట్లాడాను. ఆయన ఆడేటప్పుడు మేము తప్పకుండా చూస్తాం" అని తెలిపారు.అదే సమయంలో రితికా సజ్దేకు సంబంధించిన ఒక ప్రత్యేక విషయాన్ని ఆయన వెల్లడించారు. "అయితే, స్టేడియంలో మేం ఆయన భార్య వైపు చూస్తుంటాం. ఎందుకంటే, రోహిత్ ఆడుతున్నంత సేపు ఆమె తన చేతి వేళ్లను క్రాస్ (fingers crossed) చేసుకొని ఉంటారు. ఈ విషయం మాకు ఆశ్చర్యం కలిగించడంతో, దీని గురించి ఆమెను అడిగాను. పెళ్లికి ముందు నుంచే, రోహిత్ మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ తాను అలా వేళ్లను క్రాస్ చేసుకొని ఉంటానని ఆమె చెప్పారు. ఇది చాలా మంచి విషయం అనిపించింది" అని అమితాబ్ వివరించారు.ప్రస్తుతం 'కౌన్ బనేగా కరోడ్‌పతి' సీజన్ 18 సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్‌లో ప్రసారమవుతోంది. ఇదే ఛానెల్‌లో రోహిత్ శర్మ కూడా 'ఫ్యామిలీ ఫుల్ హౌస్' అనే కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరిస్తుండటం గమనార్హం.







# రూ. 7000 కోట్ల దావా: నటి ఊర్వశి రౌతేలాకు ఏఐ కంపెనీ సీఈఓ ఘాటు రిప్లై

**తన పేరు, ఫోటోలను వాడారంటూ ఏఐ కంపెనీపై ఊర్వశి లీగల్ యాక్షన్**

**రూ. 7,000 కోట్ల నష్టపరిహారం కోరుతున్నట్లు తెలిపిన నటి టీమ్**

**ఆ మాటలు మేం నీతో బలవంతంగా పలికించలేదంటూ కౌంటర్ ఇచ్చిన ఏఐ కంపెనీ సీఈఓ**

**ఏఐ, భవిష్యత్ వినోదంపై అవగాహన పెంచుకోవాలంటూ ఊర్వశికి చురక**

**బాలీవుడ్ భవిష్యత్తు ఏఐదేనని స్పష్టం చేసిన సీఈఓ షీరాజ్ హసన్**

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా, లాస్ ఏంజిల్స్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంస్థ మధ్య వివాదం ముదురుతోంది. తన పేరు, చిత్రాలు, వీడియోలను అనుమతి లేకుండా వాడుకున్నారంటూ ఊర్వశి టీమ్ చేసిన ఆరోపణలపై బాలీవుడ్.ఏఐ, హాలీవుడ్.ఏఐ ఫౌండర్, సీఈఓ షీరాజ్ హసన్ తాజాగా స్పందించారు. ఊర్వశికి గట్టిగా కౌంటర్ ఇస్తూ, ఏఐ భవిష్యత్తుపై అవగాహన పెంచుకోవాలని సలహా ఇచ్చారు.తాజాగా, ఊర్వశి టీమ్ ఒక ప్రకటన విడుదల చేసింది. తమ అనుమతి లేకుండా ఊర్వశి గుర్తింపును, కంటెంట్‌ను ఒక ఏఐ కంపెనీ వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుకుందని, దీని ద్వారా ఆ సంస్థ బిలియన్ల డాలర్ల విలువను సృష్టించిందని ఆరోపించింది. ఈ కారణంగా ఆ సంస్థపై రూ. 7,000 కోట్ల నష్టపరిహారం కోరుతూ చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేసింది. "మా అనుమతి లేకుండా ఊర్వశి పేరును మీ వ్యాపారానికి వాడుకోవద్దు" అని ఆ ప్రకటనలో హెచ్చరించింది.అసలు, బాలీవుడ్.ఏఐ సంస్థకు ఊర్వశి ఇచ్చిన ఓ వైరల్ ఇంటర్వ్యూతో ఈ వివాదానికి బీజం పడింది. అందులో బాలీవుడ్, ఏఐ గురించి అడగ్గా.. "బాలీవుడ్? నా అభిప్రాయం ప్రకారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటే.. నిజంగా.. అదీ.. దానితో బాలీవుడ్ బాధపడుతోంది. నాకు బాలీవుడ్ అంటే చాలా ఇష్టం" అంటూ ఆమె కాస్త తడబడుతూ సమాధానం ఇచ్చారు.ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే షీరాజ్ హసన్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఊర్వశికి గట్టి సమాధానం ఇచ్చారు. "ఊర్వశి, ఆ మాటలు మేము నీతో బలవంతంగా ఏమీ పలికించలేదు. ఒక సమాధానం ఇచ్చే ముందు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి, భవిష్యత్ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యాపారం గురించి తెలుసుకోవాలని నేను గట్టిగా సిఫార్సు చేస్తున్నాను" అని ఆయన పోస్ట్ చేశారు. అంతటితో ఆగకుండా, "బాలీవుడ్.ఏఐ, హాలీవుడ్.ఏఐ సంస్థలు వినోద పరిశ్రమ భవిష్యత్తు. ఏఐ సినిమాలు, డిజిటల్ స్టార్లు వయసు పెరగకుండా ఉంటారు, బహుళ భాషలు మాట్లాడగలరు, 24/7 పనిచేస్తారు, వారికి ఎలాంటి ఇగోలు ఉండవు. నువ్వు చెప్పిన సమాధానంతో పోరాడగలవేమో కానీ, రాబోయే భవిష్యత్తుతో పోరాడలేవు. దాన్ని స్వీకరించు" అంటూ బాలీవుడ్‌లో వినోద పరిశ్రమ పరిణామాన్ని అంగీకరించాలని ఆయన హితవు పలికారు. ఈ వ్యవహారంపై ఊర్వశి టీమ్ న్యాయపరంగా ముందుకు వెళ్తుండగా, షీరాజ్ హసన్ మాత్రం ఏఐ టెక్నాలజీనే భవిష్యత్తు అని గట్టిగా వాదిస్తున్నారు.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**